ప్రజాశక్తి

శనివారం 31 ఆగస్టు 2024 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

వైసిపిలో లీజు విభేదాలు

నేడు గుంటూరు కౌన్సిల్ ప్రత్యేక సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు కార్పొరేషన్ ప్రత్యేక సమావేశం శనివారం జరగనుంది. నగరంలో ఖాళీల స్థలాల ఆక్రమణలు, కార్పొరేషన్ స్థలాల లీజు వ్యవహారంలో అక్రమాలపై సమావేశంలో చర్చించనున్నారు. అంతేగాక గుంటూరులో కీలకమైన విద్యా సంస్థ శ్రీ వెంకటేశ్వర బాలకుటీర్ విద్యా సంస్థ స్థలం లీజు పొడిగింపునకు ఈ సమావేశం ఏర్పాటు చేశారని తెలిసింది. గత సమావేశంలోనే ఈ అంశంపై చర్చకు ప్రతిపాదించినా మెజార్టీ సభ్యులు తిరస్కరించడంతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్టు కార్పొరేషన్ వర్గాలు తెలిపాయి.

గుంటూరులో ఖాళీ స్థలాలకు లీజు వ్యవహారంపై ఒక్కో చోట ఒక్కో విధానం అమలు అవుతోంది. కొంత మంది వ్యాపారులకు ఇప్పటికే ఖాళీ స్థలాల లీజులో పెద్ద ఎత్తున అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికే బస్‌బేల పేరుతో కార్పొరేషన్‌లో కూడలి ప్రాంతాల్లో విలువైన స్థలాలను తక్కువ ధరకు లీజుకు ఇచ్చారనే విమర్శలు ఉన్నాయి. హోర్డింగ్‌ల ఏజెన్సీల వారికి కూడా ఖాళీ స్థలాలను తక్కువధరకు లీజుకు ఇచ్చిన వ్యవహారంపై పలుమార్లు చర్చించినా ఎవ్వరూ పట్టించుకోలేదు. తాజాగా 1974 నుంచి కార్పొరేషన్ స్థలంలో పాఠశాల నడుపుతున్న శ్రీ వెంకటేశ్వర బాలకుటీర్ లీజు గడువు త్వరలో ముగియనుండటంతో తిరిగి లీజు రెన్యూవల్ కోసం ఈ విద్యా సంస్థ నిర్వహాకులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే అతి తక్కువ అద్దె చెల్లిస్తూ భారీగా ఫీజులు తీసుకుంటున్నారని పలువురు వైసిపి కార్పొరేటర్లు గతంలో పలు మార్లు కౌన్సిల్ సమావేశాల్లో ధ్వజమెత్తారు. అయితే ఇందుకు టిడిపి కార్పొరేటర్లు కొంత మంది అభ్యంతరం చెబుతూ వస్తున్నారు. నాణ్యమైన విద్యాబోధన చేస్తున్న బాలకుటీర్ లాంటి సంస్థలను ప్రోత్సహించాలని టిడిపి కార్పొరేటర్లు చెబుతుండగా అధిక ఫీజులు వసూలు చేస్తూ కార్పొరేషన్ స్థలాన్ని అతి తక్కువ ధరకు వారికి దారాదత్తం చేస్తారా? అని వైసిపి వారు కొంత కాలంగా విమర్శిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో టిడిపి నాయకులు వైసిపికి చెందిన కీలక నేతలను మ్యానేజ్ చేశారు. వైసిపికి చెందిన మెజార్టీ కార్పొరేటర్లను సైతం తమ వైపునకు తిప్పుకున్నారు. అయితే లీజు పొడిగించే ముందు నిబందనల మేరకు వ్యవహరించాలని డిప్యూట ీమేయర్ వనమా బాల వజ్రబాబు కొంత కాలంగా వత్తిడి తెస్తున్నారు. ఈ అంశంపై శనివారం జరిగే సమావేశంలో పూర్తి స్థాయిలో చర్చకు బాల వజ్రబాబు పట్టుపట్టనున్నారు. ఆయనకు కొంత మంది వైసిపి కార్పొరేటర్లు మద్ధతు పలికే అవకాశం ఉంది.

1994 నుంచి 1999 వరకు బాలకుటీర్ స్థలం 8345 గజాల స్థలానికి ఏడాదికి రూ.50 చొప్పున 25 ఏళ్ల కాలానికి రూ.1250 అద్దె చెల్లించారని, 2000 సంవత్సరం జులై నుంచి ఇప్పటి వరకు గజానికి రూ.6 చొప్పున ప్రతి మూడేళ్లకు 33.13 శాతం పెంచుతూ చెల్లించాలని అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అయితే భూమి రిజిస్ట్రేషన్ విలువలో



10 శాతం లీజు వసూలు చేయాల్సి ఉందని ఈ మేరకు అద్దెను పెంచాలని మెజార్టీ కార్పొరేటర్లు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం 8345 గజాల స్థలానికి రూ.5 లక్షలు అద్దె చెల్లిస్తున్నందున మరికొంత పెంచి తీర్మానం ప్రభుత్వానికి పంపాలని వైసిపి కార్పొరేటర్లు అభిప్రాయపడగా కీలక నేతలు అడ్డుకుంటున్నారని ఆ పార్టీలోనే అసంతృప్తి ఏర్పడింది. కార్పొరేషన్‌లో టిడిపి, వైసిపి కుమ్మక్కు రాజకీయాలు నడుస్తున్నాయని తామేమి చేయగలమని పలువురు కార్పొరేటర్లు నర్మగర్భంగా వ్యాఖ్యానించారు. శనివారం జరిగే సమావేశంలో తమ పార్టీకి చెందిన కీలక నేతల ఆదేశాల మేరకు వైసిపి కార్పొరేటర్లు మౌనంగా ఉంటారా? లేదా పార్టీలో చీలక వస్తుందా అనే అంశంపై కార్పొరేషన్‌లె శుక్రవారం చర్చించుకుంటున్నారు. గత 50 ఏళ్ల కాలంలో బాలకుటీర్‌కు కేటాయించిన స్థలంలో చట్టపరంగా చెల్లించాల్సిన లీజు సొమ్ము రూ.49 కోట్ల వరకు ఉందని కానీ అతి తక్కువ సొమ్ము చెల్లించి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని డిప్యూటీ మేయర్ బాల వజ్రబాబు వివరించారు.

ఎడతెరిపిలేని వాన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి



లక్ష్మీపురం జంక్షన్‌లో వర్షపు నీటిని బయటకు పంపేందుకు ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్ పి.శ్రీనివాసులు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. వర్షంతో ముసురు వాతావరణం ఏర్పడింది. వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షంతో చలిగాలులు పెరిగాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం రాత్రి వేర్వేరు ప్రాంతాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. గుంటూరు పరిసర ప్రాంతాల్లో సాయంత్రం 7 గంటల నుంచి 9 గంటల మధ్య కుండపోతగా వర్షం కురిసింది. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారులను అప్రమత్తం చేశారు. పారిశుధ్యం టౌన్ ప్లానింగ్ అధికారులకు ఎక్కడికక్కడ మొహరించి సిబ్బంది వర్షం, మురుగునీరు వల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టారు. గుంటూరులోని పలు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. కలెక్టరేట్, బిఆర్ స్టేడియం, ఎన్‌టిఆర్ స్టేడియంలో వర్షం నీరు నిలిచింది. రోడ్లపై వర్షం నీరు, మురుగునీరు కలిసి పారడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పల్నాడు జిల్లాలోని పలు మండలాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. తెనాలి డివిజన్‌లో భారీ వర్షాలకు పొలాల్లో నీరు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వెదపద్ధతిలో సాగు చేసిన పొలాల్లోకి నీరు చేరి వరి పైరు నీట మునిగింది. కొల్లిపర, దుగ్గిరాల, తెనాలి, తెనాలి, తాడేపల్లి, మంగళగిరి, తాడికొండ, పెదకాకాని తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. పల్నాడు జిల్లా నరసరావుపేటలో కుండపోతగా వర్షం కురిసింది. మాచర్ల, వెల్దుర్తి, దుర్గి, రెంటచింతల, గురజాల, దాచేపల్లి ప్రాంతాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది.

ఉధృతంగా కృష్ణమ్మ ప్రవాహం

- నాగార్జున సాగర్‌కు 3,12,097 క్యూసెక్కుల ఇన్ ఫ్లో
- 26 క్రస్ట్ గేట్ల ద్వారా స్థిరంగా కొనసాగుతున్న నీటివిడుదల
- ప్రకాశంబ్యారేజీ నుండి దిగువకు 3,31,521 క్యూసెక్కులు

2 లో

వర్ష సమస్యలపై సహాయానికి జిఎంసిలో కాల్ సెంటర్

8 లో

10 గంటల్లోపే పింఛన్ల పంపిణీ పూర్తవ్వాలి : పల్నాడు కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఒకటో తేదీ ఆదివారమైన నేపథ్యంలో లబ్ధిదార్లకు ఇబ్బందులు తలెత్తకుండా సామాజిక పింఛన్లను శనివారమే పంపిణీ చేయనున్నట్లు పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు 100 శాతం పెన్షన్ పంపిణీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఉదయం 6 గంటలలోపే పంపిణీ ప్రారంభం కావాలన్నారు. ఈ అంశంపై ఆయన శుక్రవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా మండల ప్రత్యేకాధికారులతో సమీక్షించారు. శనివారం తీసుకోని వారికి సోమవారం పంపిణీ పూర్తి చేయాలని చెప్పారు.



బాలకృష్ణకు శుభాకాంక్షలు చెబుతూ సంబరాలు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నందమూరి బాలకృష్ణ సినీ రంగ ప్రవేశం చేసి 50 ఏళ్లయిన సందర్భంగా టిడిపి ఆధ్వర్యంలో మాచర్ల పట్టణం మెయిన్ సెంటర్లోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద శుక్రవారం కేక్ కట్ చేశారు. నాయకులు మాట్లాడుతూ ఒక చరిత్ర సృష్టించాలన్నా, దాన్ని తిరగరాయాలన్నా బాలకృష్ణకే సాధ్యమన్నారు. లక్షలాది మంది కేన్సర్ బాధితులకు ఉచితంగా వైద్యం అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు కె.దుర్గారావు, నాయకులు వై.మల్లికార్జునరావు, ఎం.చిన్న వెంకట్రామిరెడ్డి, కె.అనిల్‌కుమార్, శివ, నీలంరాజు పాల్గొన్నారు.



పురస్కారాలతో రవికుమార్, రమాదేవి

రవికుమార్,రమాదేవికి గిడుగు వెంకట రామమూర్తి పురస్కారాలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పట్టణానికి చెందిన బెజగం రవికుమార్, సరికొండ రమాదేవికి గిడుగు వెంకట రామమూర్తి పురస్కారాలు ప్రదానం చేశారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం జరిగిన మాతృభాషా దినోత్సవంలో యువి రత్నం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పురస్కారాలను వీరు అందుకున్నారు. సాహిత్య, రంగస్థల, విద్యా సేవరంగాల్లో 20 మందికి పురస్కారాలను అందించగా సత్తెనపల్లికి చెందిన సాహితి వేత్త డాక్టర్ సరికొండ రమాదేవి, పౌరాణిక కళాకారుడు బెజగం రవికుమార్ రంగస్థలం కలరంగం పురస్కారాలు అందించారు.

పొదుపు, బీమా అవగాహన

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ఆరోగ్య బీమా మరియు ఆర్థిక అక్షరాస్యతపై మండల కేంద్రమైన వెల్దుర్తి మండల పరిషత్ కార్యాలయంలో ఐటిసి, సెర్ప్ ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుధ్య కార్మికులకు అవగాహన కల్పించారు. ఎంపిడిఒ ప్రసాద్, ఇఒపిఆర్‌డి మకట్ లాల్ నాయక్ హాజరవగా శిక్షకులు బొల్లయ్య మాట్లాడుతూ బీమా రకాలు, ప్రాధాన్యం గురించి వివరించారు. క్లాప్ మిత్రులకు ఒక సంవత్సరం బీమాను చేయిస్తామని ఇఒపిఆర్‌డి, మకట్ లాల్ నాయక్, వినోద్ కుమార్ ప్రకటించడంతో వారు సంతోషం వెలిబుచ్చారు. కార్యక్రమంలో సిఒ మాడెబోయిన గురుప్రసాద్, సతీష్, పంచాయతీల కార్యదర్శిలు, క్లాప్ మిత్రాలు పాల్గొన్నారు.



ఉధృతంగా కృష్ణమ్మ ప్రవాహం





ప్రజాశక్తి - విజయపురిసౌత్, తాడేపల్లి

కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువనున్న జలాశయాలు నిండి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. శుక్రవారం సాయంత్రానికి శ్రీశైలం జలాశయం నుండి 3,12,097 క్యూసెక్కుల నీరు నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టు 18 క్రస్ట్ గేట్లను 5 అడుగులు వరకు, 8 క్రస్ట్ గేట్లను 10 అడుగులు వరకు మొత్తం 26 క్రస్ట్ గేట్లను ఎత్తి 2,62,430 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు కాగా ప్రస్తుతం 589.00 అడుగులవద్ద నీరు నిల్వవుంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.0450 టీఎంసీలు కాగా ప్రస్తుతానికి 309.0570 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 29,354 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 9633 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 8280 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బిసి ద్వారా 1800 క్యూసెక్కులు, లోలేవల్ కెనాల్ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తంగా రిజర్వాయర్ నుండి 3,12,097 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

మరోవైపు ప్రకాశం బ్యారేజీ నుంచి 35 గేట్లు ఎనిమిది అడుగులు, 35 గేట్లు ఏడడుగులు మేర ఎత్తి 3.21 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. బ్యారేజీకి 3,14,800 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా 3,31,521 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. పశ్చిమ, తూర్పు డెల్టా, ఏలూరు, బందరు, రైవస్ కాల్వలకు 16,721 క్యూసెక్కుల విడుదల చేస్తున్నట్లు బ్యారేజీ ఎఇ దినేష్ తెలిపారు. నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాడేపల్లి రెవెన్యూ అధికారులు సూచించారు.

రైల్వే డబుల్ లైన్ కోసం సర్వే ప్రారంభం



ప్రజాశక్తి - పెదకూరపాడు

గుంటూరు నుండి బీబీ నగర్ రైల్వే డబుల్ లైన్‌కు రైతుల భూములు సర్వే శుక్రవారం నుండి ప్రారంభించారు. సత్తెనపల్లి డివిజన్ పరిధిలో పెదకూరపాడు, రాజుపాలెం, బెల్లంకొండ, సత్తనపల్లి మండలాల పరిధిలో 127 ఎకరాల ఒక సెంటు అవసరమని నిర్ణయించారు. అందుకు అనుగుణంగా రైల్వే శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. పెదకూరపాడు మండలం లింగంగుంటలో 12.54 ఎకరాలు, పెదకూరపాడులో 11.18 ఎకరాలు, చిన్నమక్కెనలో 68 సెంట్లును తీసుకోవాలని నిర్ణయించారు. రాజుపాలెం మండలం రెడ్డిగూడెంలో 13.22 ఎకరాలు, కుబాత్‌పురంలో 4.83 సెంట్లు, రాజుపాలెంలో 10.20 ఎకరాలు, బెల్లంకొండలో 11.73 ఎకరాలు, సత్తెనపల్లి మండలం గుడిపూడిలో 4.22 ఎకరాలు, అబ్బూరులో 2.08 ఎకరాలు, భీమవరంలో 5.13 ఎకరాలు, సత్తెనపల్లిలో 17.15 ఎకరాలు, కంకణాలపల్లిలో 7.96 ఎకరాలు, ధూళిపాళ్లలో 12.36 ఎకరాలను రైతలు వద్ద తీసుకోవాలని నిర్ణయించారు. అయితే నోటిఫికేషన్‌లో ఎక్కడా రైతులుకి ఇచ్చే పరిహారాన్ని ప్రకటించలేదు.

మహిళా ఫిర్యాదుదారుల కోసం వెయిటింగ్ రూమ్ : పల్నాడు ఎస్పీ

ప్రజాశక్తి-వినుకొండ : ఫిర్యాదు చేయడానికి వచ్చే మహిళలకు పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేకంగా వెయిటింగ్ రూం ఉండాలని పల్నాడు జిల్లా ఎస్‌పి కె.శ్రీనివాసరావు చెప్పారు. శావల్యాపురం పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం సందర్శించిన ఆయన సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణ, ముఖ్యమైన కేసుల ఫైళ్లను తనిఖీ చేశారు. తనిఖీల్లో పట్టుబడిన వాహనాలను త్వరగా డిస్పోస్ చేయాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలనీ, డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలని చెప్పారు. రోడ్డు భద్రతా నియమాలపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. వివిధ కేసుల్లో నిందితులను త్వరగా అరెస్టు చేయాలని, అందుకుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో నమోదైన కేసుల్లో నిందితులను త్వరగా అరెస్టు చేయాలన్నారు. విద్యాసంస్థలు, హాస్టళ్ల వద్ద నిఘా ఏర్పాటు చేయాలని, ఎక్కువగా విజిబుల్ పోలీసింగ్ చేయాలని సూచించారు. రాత్రి మరియు పగలు బీట్ల పని తీరును నిరంతర పర్యవేక్షిస్తే నేరాలు తగ్గుతాయన్నారు. రౌడీషీటర్ల కదలికలు, కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మండల పరిధిలోని జూలకల్లు, జానపాడు, రాజుపాలెం మండల పరిధిలోని అనుపాలెం, పిడుగురాళ్ల పట్టణంలో శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తామని విద్యుత్ శాఖ అధికారి శివనాగిరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్ల్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ నిలుపదల చేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎస్ఎస్ఎన్ విద్యార్థి



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

బాపట్ల జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట ఎస్ఎస్ఎన్ కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో ఈనెల 25న జరిగిన 10వ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల సీనియర్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఎస్ఎస్ఎన్ కళాశాల డిగ్రీ మూడో సంవత్సరం విద్యార్థి ఎస్.జగదీష్ ప్రతిభ చాటి 77వ జాతీయ సీనియర్ సిమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యారు. జగదీష్ 100 మీటర్లు, 200 మీటర్ల బటర్ ఫ్లై విభాగంలో, 800 మీటర్ల ఫ్రీ స్టైల్ విభాగాల్లో బంగారు పతకం, 50 మీటర్ల బటర్ ఫ్లై విభాగంలో రజత పతకం, 400 మీటర్ల ఐఎంలో రజత పతకం మొత్తంగా 3 బంగారు పథకాలు, 2 రజత పతకాలతో తమ కళాశాలకే పేరు ప్రఖ్యాతలు తెచ్చారని ఎస్ఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. సుబ్రహ్మణ్య సుధీర్ అన్నారు. వచ్చే నెల 10 నుండి 13వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రం మంగుళూరులో జరిగే జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరుపున జగదీష్ ప్రాతినిధ్యం వహించనున్నట్లు చెప్పారు. జగదీష్‌తోపాటు కోచ్ సురేష్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్షులు కపలవాయి విజయకుమార్, సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్, మున్సిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్త, వైస్ ప్రెసిడెంట్ పెనుగొండ వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ ఊటుకూరు వెంకట అప్పారావు, పాలకవర్గ సభ్యులు, వైస్ ప్రిన్సిపాల్, ఇంటెన్సివ్ క్యాంపస్ ఇన్‌ఛార్జి డాక్టర్ పానుగంటి శ్రీనివాససాయి, పీడీలు వై.మధుసూదనరావు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

మా డబ్బుల కోసమే మౌనపోరాటం

ప్రజాశక్తి-చిలకలూరిపేట



తమకు రావాల్సిన రూ.8.30 కోట్ల కోసం తాము మౌన పోరాటం చేస్తున్నామే కానీ ఇందులో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకు గాని, టిడిపికిగాని సంబంధం లేదని ప్రముఖ కాంట్రాక్టర్ వీరయ్య చౌదరి అన్నారు. శుక్రవారం స్థానిక అడ్డరోడ్ సెంటర్లో గల సాయి కార్తీక్ సినిమా హాల్ ఎదురుగా ఆయన పలువురు వ్యాపారులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. 2017-19లో ఇచ్చిన డబ్బులు వసూలు కోసమే ఈ మౌన పోరాటమన్నారు. 10-12 రోజుల నుంచి ఇక్కడే పట్టణంలోని 15 మంది వివిధ వ్యాపార ప్రముఖులు వారికి రావలసిన డబ్బులు ఇమ్మని సాయి కార్తీకు యజమాని అయినా రావి మురళి అడిగితే సమాధానం అనుచితంగా చెప్పడంతో ఆదోళన చేస్తున్నామని తెలిపారు. రావి మురళి తమకు సమాధానం ఇచ్చే క్రమంలో కొద్దీసేపు అతని తండ్రి రావి సుధాకర్ ఇస్తారులే అని, మరొకరు ఇస్తారులే అని కాసేపు నేను ఎన్నారై అని.. ఇవ్వనూ అంటూ కొన్నిసార్లు అంటున్నారని విమర్శించారు. ఎన్నారై అనే ముసుగులో సోషల్ మీడియాలో అనుచితంగా పోస్టులు పెడుతున్నారన్నారు. తమకు డబ్బులు ఇచ్చే వరకూ నిరసన కొనసాగుతుందని స్పష్టం చేశారు.



రాజకుమారి భౌతిక కాయానికి నివాళులు అర్పిస్తున్న సిఐటియు నాయకులు

సిఐటియు నాయకులు దీవెనరావు తల్లి కన్నుమూత

ప్రజాశక్తి-గుంటూరు

భవన నిర్మాణ కార్మిక సంఘం గుంటూరు నగర తూర్పు కమిటీ ప్రధాన కార్యదర్శి పి.దీవెనరావు తల్లి పచ్చిగొల్ల రాజకుమారి మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె గురువారం సాయంత్రం మరణించారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆమె భౌతిక ఖాయాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి, నగర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, బి.ముత్యాలరావు, జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు, టి.రాధ, బి.సత్యనారాయణ, నికల్సన్, సిపయం నగర కార్యదర్శి కె.నళనీకాంత్, జి.శంకర్ తదితరులు సందర్శించి నివాళి అర్పించారు. కుటుంబానికి సానుభూతి తెలిపారు.

మహానాడులో పోలీసుల కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి మహానాడులో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్‌పి శ్రీనివాసరావు మాట్లాడుతూ గుంటూరు ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు మహానాడు ప్రాంతంలో సుమారు వంద మంది సిబ్బందితో కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు చెప్పారు. సరైన పత్రాలు లేని 150 బైకులను స్వాధీనం చేసుకుని వాహనదారులను హెచ్చరించినట్లు తెలిపారు. అనుమానిత ఇళ్లలు తనిఖీ చేశామన్నారు. అలానే సస్పెక్ట్ షీట్, రౌడీషీట్, గతంలో గంజాయి కేసులులో దొరికిన నిందితులను కలిసి హెచ్చరించారు. పాత నేరస్తులు ఎవరు ప్రజలను ఇబ్బంది కలిగించకూడదని, నేరాలు చేయకూడదని అన్నారు. కార్డెన్ సెర్చ్ ద్వారా పాత నేరస్తులు మళ్లీ నేరం చేయకుండా అరికట్టే అవకాశం ఉందన్నారు.



రహదారులకు వీడిన గ్రహణం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రహదారుల నిర్మాణం, మరమ్మతులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే నశీర్ అహ్మద్ అన్నారు. శుక్రవారం ఎల్.ఆర్. కాలనీ 6, 7, 9 లైన్ లో సీసీ రోడ్లు డ్రైన్లు నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ రూ.48.60 లక్షలతో ఆరు ఏడు తొమ్మిది లైన్లలో సిసి డ్రైన్లు నిర్మాణం జరుగుతోందన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గం లో వివిధ అభివృద్ధి పనులు చేయబడుతున్నామని త్వరలోనే గత ప్రభుత్వ చేతకాని తనంతో గుంతలు పడి ఉన్న రోడ్లను సిసి రోడ్లు, అండర్ డ్రైన్లు చేయి పడుతున్నామని, రోడ్లు డ్రైన్లు నిర్మాణంలో నాణ్యతలో రాజీ లేకుండా ఎప్పటికప్పుడు రోడ్లు డ్రైన్లు నాణ్యతలను ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది పర్యవేక్షించాలని ఆదేశించారు.



అలాగే మారుతున్న వాతావరణం పడుతున్న వర్షాలను దృష్టిలో పెట్టుకొని పారిశుధ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎక్కడ గుంటల్లో నీళ్లు చేరకుండా చూసుకోవాలని వాటి వల్ల దోమలు చేరి డెంగీ, మలేరియా, టైఫాయిడ్, వచ్చే అవకాశాలు ఉన్నాయని కావున తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే నసీర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షులు బ్రహ్మ సాని శీను, ముల్లంపూడి శ్రీనివాసరావు,వజ్జా లక్ష్మి, లక్ష్మీ రహమతులిసా, దొడ్డ గోపి, రాంబాబు, కలాం, ఇతర అధికారులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నకిలీ నోటు కేసులో ఒకరికి జైలు

ప్రజాశక్తి-ఈపూరు : నకిలీ నోటు కేసులో దోషిగా తేలిన వర్ల చిరంజీవికి కోర్టు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ ఎం ఉమామహేశ్వరరావు శుక్రవారం తెలిపారు. మండలంలోని వనికుంట గ్రామంలో కిరాణా షాపు నడుపుతున్న కాశీమల్ల నాగరాజు వద్దకు వచ్చిన ముగ్గురు వ్యక్తులు కూల్ డ్రింక్ కొనేందుకు రూ.500 నోటును ఇవ్వగా ఆ నోటును పరిశీలించిన నాగరాజు నకిలీ నోటుగా గుర్తించి వారిని ప్రశ్నించగా వారు పరారయ్యారు. షాపు యజమాని ఫిర్యాదు మేరకు 2019 ఆగస్టు 24న అప్పటి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు దర్యాప్తు చేపట్టిన సిఐ ఎంవి సుబ్బారావు రొంపిచర్ల మండలం సంతగుడిపాడు గ్రామానికి చెందిన ముద్దాయి వర్ల చిరంజీవిని అరెస్టు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేయగా చిరంజీవిపై నేరం రుజువు కావడంతో నరసరావుపేట ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎ పూర్ణిమ ముద్దాయికి మూడు సంవత్సరాల ఆరు నెలల జైలు శిక్ష, రూ.2500 లు జరిమానా విధించారు. కేసులో ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్వర్ణలత భాను వాదనలు వినిపించగా, కోర్టు హెడ్ కానిస్టేబుల్ షేక్ ఖాసిం సహకారం అందించారు.

పెండింగ్ అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

ప్రజాశక్తి - పొన్నూరు : పట్టణ ప్రజలు వివిధ సమస్యలపై సచివాలయాల్లో దాఖలు చేసిన పెండింగ్‌లో ఉన్న అర్జీలను సిబ్బంది సత్వరమే పరిష్కరించాలని స్థానిక మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు కోరారు. శుక్రవారం పట్టణం లోని పలు వార్డుల్లో ఆయన పర్యటించారు. స్థానిక శ్రీ సహస్ర లింగేశ్వర స్వామి, శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం ముందు రోడ్డుపైకి చొచ్చుకొని ముందుకు వచ్చిన రేకుల షెడ్డులు, వివిధ రకాల షాపులు రోడ్డుకు అవతల వైపు ఏర్పాటు చేసుకోవాలని, తద్వారా యాత్రికులకు అసౌకర్యం లేకుండా చూడాలని ఆయన నిర్వాహకులకు తెలియజేశారు. పట్టణం లోని ప్రజలకు మౌలిక వసతులు, కనీస సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు చేపడతామని, ప్రజలు తమ వంతు సహకారం అందించాలని కోరారు. రోడ్లపై, మురుగు కాలువల్లో చెత్త, వ్యర్థాలు పడవేయకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పరిశుభ్రమైన తాగునీరు, లైటింగ్, మెరుగైన పారిశుధ్యం కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. పారిశుద్ధ్యం మెరుగుపరిచే కార్యక్రమంలో భాగంగా చెత్తను డంపింగ్ యార్డ్ కు తరలించడానికి అవసరమైన మరమ్మతులు చేరిన యంత్రాలు, పనిముట్లు సమకూర్చుకునేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం 23 వార్డులోని 14వ సచివాలయంలో మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు సందర్శించారు.



పత్తిపొలంలో నిలిచిన వర్షపు నీరు

పైర్లకు జీవం.. సాగుకు సిద్ధం..

వానతో ఊపిరి పోసుకున్న పత్తి, కూరగాయ పొలాలు

పొగాకు, మిర్చి సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పొగాకు, మిర్చి సాగుకు కోసం దుక్కులు పూర్తి చేసిన రైతులు వర్షం కోసం 70 రోజులుగా నిరీక్షిస్తున్నారు. తాజా వానలతో వీరంతా హమ్మయ్య అనుకుంటున్నారు. మండలంలో సుమారు రెండు వేల ఎకరాల్లో పత్తి సాగవ్వగా, అక్కడక్కడా స్వల్ప విస్తీర్ణంలోనే కూరగాయలు సాగయ్యాయి. మురికిపూడి, తాతపూడి, మంగలపాలెం, మున్నోరివారిపాలెం తదితర గ్రామాల్లో పొగాకు నారుమళ్లు పోశారు. గురువారం రాత్రి నుండి పడుతున్న వర్షాలు ఈ నారుమళ్లకు మేలు చేస్తుందని రైతులు భావిస్తున్నారు. దుక్కులు పూర్తిచేసి సిద్ధంగా ఉంచిన పొలాల్లో పొగాకు, మిర్చి ఇతర పంటల సాగుకు రైతులు ఉద్విక్తులవుతున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటికే వివిధ రకాల పైర్లు 50-70 రోజుల దశలో ఉండగా నాటిన నాటి నుండి సరైన వానల్లేక పైర్లు జీవకళ తప్పాయి. ఎత్తు పెరగకపోవడం, పూత, పిందె సరిగా రాకపోవడం, తెలుళ్లు ఆశించడం వంటి వాటితో రైతులు ఆందోళనలో ఉన్నారు. తాజా వర్షం పైర్లకు జీవం పోసినట్లయింది. మండలంలోని పోతవరానికి చెందిన బాష 70 సెంట్లలో బీరకాయ, రెండెకరాల్లో పత్తి సాగు చేయగా బీర పొలానికి ఓగేరువాక నుంచి నీరు పెడుతున్నారు. నాలుగైదు రోజుల్లో వానలు రాకుంటే పత్తి పొలానికీ ఇదే నీరు పెట్టుకోవాల్సి వచ్చేదని, ఇప్పుడు సమస్య తేదని చెబుతున్నారు.



సాంబశివరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే పుల్లారావు తదితరులు

కందిమళ్ల సాంబశివరావుకు ఎమ్మెల్యే సత్కారం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

తెలుగు నాటక రంగానికి డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. తెలుగు భాషా వికాసానికి చేసిన కృషికి గాను సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ నుండి పురస్కారాన్ని అందుకున్న కందిమళ్ల సాంబశివరావును ఎమ్మెల్యే పుల్లారావు స్థానిక పండరిపురంలోని తన నివాసంలో శుక్రవారం సన్మానించారు. తెలుగు అధ్యాపకులుగా, నాటక రంగ పరిశోధకులుగా, రచయితగా ఆయన కృషి అమూల్యమన్నారు. నాటక రంగంలో పరిశోధనలకు గాను ఆ విభాగంలో భారతదేశం నుంచి తొలి పిహెచ్‌డి అందుకున్న ప్రతిభాశాలి అని చెప్పారు. ఆయన స్ఫూర్తిని ఏ కొంతమంది యువత అందుకున్నా తెలుగుభాష పరిరక్షణ, రంగస్థల కళల ఉనికికి చాలా ఉపయుక్తమని, వాటి మనుగడకు దిగులు లేనట్టేనని చెప్పారు. కార్యక్రమంలో టి.సుబ్బారావు, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కుండపోత.. రోడ్లు మునక..

- అస్తవ్యస్తంగా డ్రెయినేజీ
- రహదార్లపైనే మురుగునీరు
- దుర్గంధంతో జనం అవస్థలు





ప్రజాశక్తి - వినుకొండ

శుక్రవారం ఉదయం వినుకొండలో సుమారు రెండు గంటల పాటు ఎడతెరిపిలేని వానతో పట్టణంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. కొన్ని వార్డుల్లో డ్రెయినేజీ నీరు రోడ్లపై ప్రవహిస్తూ చెరువును తలపించింది. మురుగు నీటి ప్రవాహంతో భరించలేని దుర్గంధం వెదజల్లటం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాకపోకలకూ అవస్థ పడ్డారు. శృంగారవనంలో డ్రెయినేజీ కాల్వలు చిన్నవిగా ఉండటం, పట్టణంలోని ఎగువలో ఉన్న కాల్వలన నుండి వర్షం, మురుగునీరు కలిసి ప్రవహించడంతో పల్లపు ప్రాంతాలను ఈ నీరంతా ముంచెత్తింది. 32 వార్డుల్లో ప్రతివీధిలోనూ మురునీరు రోడ్లపైకి చేరి తీవ్ర దుర్గంధం వెదజల్లింది.

పట్టణంలోని మురుగు నీరంతా డ్రెయినేజీ కాల్వల ద్వారా పట్టణానికి దిగువలో ఉన్న ముట్లకుంట చెరువుకు చేరాల్సి ఉంది. ఇసుక వాగు నుండి ప్రధాన కాల్వ ఉన్నప్పటికీ ఎగువ నుండి వర్షం నీటితో మురుగునీరు ప్రవాహం అధికమై రోడ్లపై ప్రవహిస్తోంది. ఎబిఎం కాంపౌండ్, ఏనుగుపాలెం రోడ్డు నుండి మురుగునీరు శృంగారవనం నుండి ముట్లకుంట చెరువుకు చేరాల్సి ఉండగా ఆదంతా రోడ్లపైనే నిలిచింది. హనుమాన్ నగర్, వెల్లటూరు రోడ్డు, సంజయ్ గాంధీ నగర్, ఓబయ్య కాలనీ, డబ్బా స్తంభం సెంటర్, పెద్ద మసీదు బజార్, శివాలయం వెనుక భాగం, కోటనాల్సా బజార్, పెద్దనాల్స బజార్, తిమ్మాయపాలెం రోడ్డు, పప్పు బజార్, మక్కెన నగర్, తదితర ప్రాంతాల్లోని వీధులన్నీ మురుగు నీటితో ప్రవహించాయి. పట్టణానికి దిగువ ప్రాంతంలో ఉన్న రైలుపేట, అంబేద్కర్ నగర్, ముట్లకుంట కాలనీ, జగ్జీవన్‌రామ్ కాలనీ తదితర ప్రాంతాల్లో డ్రెయినేజీ సదుపాయం లేక అక్కడి వారు పడుతున్న అవస్థ వర్ణనాతీతం. వినుకొండ పురపాలక సంఘంగా ఏర్పడి 18 ఏళ్లు దాటినా నేటికీ కొన్ని ప్రాంతాల్లో స్థానికులే మురుగునీటిని వెలుపలకు పంపించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నా డ్రెయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం మాత్రం లభించడం లేదని, నిధులన్నీ ఎక్కడికి పోతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే 20 రోజులుగా ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారు. తాజాగా డ్రెయినేజీ సమస్యతో పారిశుధ్యం మరింత క్షీణించి దోమలు ప్రబలుతాయని, వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

డ్రెయినేజి, కల్వర్టును పరిశీలించిన చైర్మన్

15వ వార్డులో పొంగిపొర్లుతున్న డ్రెయినేజీ, కల్వర్టును మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి, కౌన్సిలర్ షకీలా పరిశీలించారు. వర్షపు నీరు నిలిచిపోవడాన్ని గుర్తించి పూడికతీత చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. సిబ్బంది పనుల్లో నిమగ్నమయ్యారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యే అవకాశం : కమిషనర్

అల్పపీడనం ప్రభావంతో మూడ్రోజులపాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో పట్టణ ప్రజలు, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ ఎం.సుభాష్ చంద్రబోస్ ఒక ప్రకటనలో సూచించారు. అధిక వర్షాలతో లోతట్టు ప్రాంతలు జలమయం అయ్యే అవకాశం వున్నందున అత్యవసరం అయితే మినహా బయటకు రావొద్దని, పిల్లల్ని జాగ్రత్తగా సూచోవాలని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం వున్నందున కాచి చల్లార్చిన నీటినే తాగాలని, వేడి వేడి ఆహర పదార్థాలు మాత్రమే తినాలని, బయట తినుబండారాలను తీసుకోవద్దని సూచించారు.

శ్రేణుల ఉత్సాహంపై వర్షం నీళ్లు..

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలంలోని కాకాని గ్రామ పరిధిలో గల జెఎన్‌టియు కళాశాల ప్రాంగణంలో వనమహోత్సవానికి హాజరవ్వాల్సిన సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ పర్యటన రద్దవడంతో టిడిపి శ్రేణులు నిరుత్సాహానికి గురయ్యారు. తొలుత 600 మంది పోలీసులతో అధికారులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఐదారు వేలమంది కూర్చునేలా సభా ప్రాంగణం ఏర్పాట్లు చేశారు. పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జెసి సూరజ్ ధనుంజయ్, ఎస్పీ కె.శ్రీనివాసరావు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, టిడిపి ఇతర ముఖ్య నాయకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అయితే ఉదయం 8 గంటల వరకు వర్షం కురుస్తుండడంతో హెలికాప్టర్ దిగడానికి కేటాయించిన స్థలం అనుకూలం కాదని మంగళగిరి నుండే నేరుగా రోడ్డు మార్గాన సిఎం, డిప్యూటీ సిఎం వచ్చేందుకు వీలుగా ఏర్పాటు చేశారు. అయితే 8 గంటల నుండి 9 గంటల వరకు ఒక మోస్తరుగా కురిసిన వాన ఆ తర్వాత రెండు గంటలపాటు కుండపోతగా కురవడంతో సభా ప్రాంగణం మొత్తం బురదమయమైంది. వర్షపు నీరు సభా ప్రాంగణంలోకి వచ్చింది. దీంతో సిఎం పర్యటనను రద్దు చేస్తున్నట్లు 10.30 గంటలకు అధికారికంగా ప్రకటించారు. దీంతో అప్పటికే అక్కడకు చేరిన టిడిపి శ్రేణులు, అధికారులు వెనుదిరిగారు.



సభా ప్రాంగణంలో వర్షపు నీటిలో ఎమ్మెల్యే తదితరులు



ఆర్టీఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై సెమినార్

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మండలంలోని కంటెపూడి వరప్రసాద్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో 'టెక్ ఆఫ్ ది ఎరా : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' అంశంపై శుక్రవారం సెమినార్ నిర్వహించారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రొఫెసర్లు డాక్టర్ కె.హేమంత్ కుమార్ డాక్టర్ ఎం.దుర్గాప్రకాష్ పలు అంశాలపై వివరించారు. రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎంత విప్లవాత్మకమైన ప్రభావం చూపుతుందో చెప్పారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్. సి.హెచ్. శ్రీనివాసకుమార్, సిఎస్ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ పాల్సన్ పాల్గొన్నారు.

ఆదర్శనీయం.. సరికొండ లక్ష్మమ్మ జీవితం..



రక్తదానం చేస్తున్న కుటుంబీకులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సరికొండ లక్ష్మమ్మ జీవితం అందరికీ ఆదర్శనీయమని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ అన్నారు. లక్ష్మమ్మ 9వ వర్ధంతి సభ స్థానిక రాజులు కాలనీలోని ఆమె నివాసం వద్ద సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఆమె చిత్రపటానికి పలువురు పూలమాలలేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విజయ్‌కుమార్ మాట్లాడుతూ సరికొండ రామలింగరాజు, లక్ష్మమ్మ దంపతులు నిరుపేద కుటుంబానికి చెందిన వారే అయినా వారి పిల్లలను ఎంతో క్రమశిక్షణతో పెంచారని, కుమార్తె వెంకాయమ్మ, కుమారులు చిన్నబాబు, లెనిన్‌బాబు, మనవళ్లు సంపత్ కుమార్, శివప్రసాద్‌ను ఉన్నతమైన చదువులు చదివించి ప్రయోజకులను చేశారని అన్నారు. కూలి పనులు చేస్తూ పిల్లలను చదివించుకుంటూ, కుటుంబాన్ని సంరక్షించుకుంటూనే వ్యవసాయ కార్మిక సంఘం, మహిళా సంఘం, సిపిఎం కార్యక్రమాల్లో లక్ష్మమ్మ చురుగ్గా పాల్గొని అందరికీ ఆదర్శంగా నిలిచారని గుర్తు చేశారు. తోటి కూలీలతో, ఇరుగుపొరుగు వారితో ఎంతో ఆప్యాయత, అదరాభిమానాలతో మెలిగేవారన్నారు. చలమయ్య మాట్లాడుతూ తన బిడ్డలనే కాక తోటి వారి బిడ్డలు సైతం చదువుకొని ప్రయోజకులు కావాలని, అభ్యుదయంగా జీవించాలనే ఆమె ఆశయాన్ని ముందుకు తీసుకు వెళ్లేందుకు ఆమె కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. ఆమె చనిపోయిన నాటి నుండి నేటి వరకు ఆమె వర్ధంతి సందర్భంగా పేద విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఆరుగురు పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున సాయం అందజేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణ్ పర్యవేక్షణలో లక్ష్మమ్మ పెద్ద కుమారుడు లెనిన్‌బాబు, మనవడు శివప్రసాద్ రక్తదానం చేశారు. సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు ఎస్.ఆంజనేయులు నాయక్, జి.ఉమశ్రీ, జి.మల్లేశ్వరి, జి.బాలకృష్ణ, ఎ.సీత, జి.రజిని, ఎ.ప్రసాద్‌రావు, పి.ప్రభాకర్, జి.సుసులోవ్, డి.పుల్లారావు, ఎ.వెంకటనారాయణ, షేక్ సాయిబా, సైదులు, మస్తాన్‌లి, ఎస్.దుర్గాబాయి, జి.అమూల్య పాల్గొన్నారు.



లక్ష్మమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

యూనిఫైడ్ పెన్షన్ స్కీంపై యుటిఎఫ్ నిరసన

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర ప్రభుత్వం తాజాగా తెరపైకి తెచ్చిన యూనిఫైడ్ పెన్షన్ స్కీంను అంగీకరించేది లేదని యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణ కమిటీ చైర్మన్ యం.హనుమంతరావు అన్నారు. శుక్రవారం గుంటూరు తాలూకా కేంద్రంలో యుపిఎస్‌పై జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. ఉద్యోగులు కంట్రిబ్యూషన్ చెల్లించే ఏ పెన్షన్ స్కీమును అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. యుపిఎస్ కూడా జిపిఎస్ లాంటిదేనని అన్నారు.ఉద్యోగులకు ఎలాంటి మేలు చేయదని చెప్పారు.యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యం.కళాధర్ మాట్లాడుతూ ప్రభుత్వాలు పెన్షన్ హక్కుపై సుప్రీంకోర్టు తీర్పును కూడా తుంగలో తొక్కుతున్నాయని అన్నారు. పాత పెన్షన్ సాధించేవరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై యుటిఎఫ్ పోరాటం కొనసాగుతుందని అన్నారు. దేశవ్యాప్తంగా ఉద్యోగులనుంచి వస్తున్న డిమాండ్ మేరకు పాత పెన్షన్ విధానాన్ని పునర్దురించాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల డిప్యూటీ తహసీల్దార్ సిహెచ్.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, ఏ.ఎల్.శివపార్వతి, జిల్లా సిపిఎస్ కమిటీ కన్వీనర్ సిహెచ్.ఆదినారాయణ, కో కన్వీనర్ ఎండి.షకీలాబేగం, జిల్లా కార్యదర్శులు జి.వెంకటేశ్వరరావు, యం.గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి మంగళగిరి

ఎస్ టి ఎఫ్ఐ, యుటిఎఫ్ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా అన్ని తాలూకా కేంద్రాల్లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం భాగంగా శుక్రవారం యుటిఎఫ్ మంగళగిరి ప్రాంతీయ శాఖ మంగళగిరిలోని ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏ నాగ కుసుమ కుమారి, జిల్లా కార్యదర్శి యు. రాజశేఖర్, టి. ఆంజనేయులు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ అడివి శ్రీనివాసరావు, యుటిఎఫ్ సీనియర్ నాయకులు డి మాల కొండయ్య, బి జాకబ్, సిహెచ్. రాధాకృష్ణ, యు ఏడుకొండలు, మండల నాయకులు టి భాస్కరరావు, ఎం. సతీష్, బి.సుబ్రహ్మణ్యం, ఆర్ ఇందుమతి, టి ఉమామహేశ్వరరావు, ఈ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



గుంటూరులో తాలూకా కేంద్రంలో నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు



మంగళగిరి అంబేద్కర్ సెంటర్లో నిరసన వ్యక్తం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

పచ్చదనం, పరిశుభ్రత అందరి బాధ్యత

ఎరుకలపూడిలో మొక్కలు నాటిన మంత్రి నాదెండ్ల మనోహర్



ప్రజాశక్తి తెనాలి

మొక్కలు నాటడం ద్వారా భవిష్యత్తులో వర్షాభావ పరిస్థితులను అధిగమించవచ్చునని, పచ్చదనం ప్రతి ఒక్కరి భాధ్యతనని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం రూరల్ గ్రామం ఎరుకలపూడిలో మొక్కలు నాటే కార్యక్రమంలో మంత్రి మనోహర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచన మేరకు వన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో పట్టణాల్లో ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు. సెప్టెంబర్ 2న పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం ఏర్పాటు చేశామని, దానిని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఓఎస్డీ యేసురత్నం, పార్టీ నాయకులు పి మురళీకష్ణ, హరిదాస్ గౌరీ శంకర్, బండారు రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరులో 10 వేల మొక్కలు నాటడానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి-గుంటూరు



రాష్ట్ర ప్రభుత్వం పచ్చదనం పెంపునకు చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 10 వేల మొక్కలను నాటడానికి కార్యాచరణ సిద్ధం చేశామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం నగరంలోని వన మహోత్సవంలో భాగంగా గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ నల్ల చెరువు వాకింగ్ ట్రాక్‌లో, పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి శ్రీరామ్ నగర్ లో మొక్కలను నాటారు. అటవీ శాఖ నుండి 10 వేల మొక్కలను తీసుకున్నట్లు చెప్పారు. రోడ్ మార్జిన్లలో నాటడానికి వీలుగా 5 అడుగులపైగా ఎత్తు ఉన్న 1000 మొక్కలను కడియం నర్సరీ నుండి తెప్పించామని తెలిపారు. ప్రదానంగా కాలనీల అంతర్గత రహదారులు, చెరువు కట్టలు, వాకింగ్ ట్రాక్‌లు, కాలనీల్లోని ఖాళీ స్థలాలు, పార్కుల్లో మొక్కలు నాటేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగర ప్రజలు వన మహెూత్సవంలో పాల్గొని ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి, వాటిని పరిరక్షించాలని, అప్పుడు పచ్చదనంతో నిండిన ఆరోగ్యకర గుంటూరు నగరం సాధ్యమవుతుందన్నారు.

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి :వనమహోత్సంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు అయ్యి మొక్కలు నాటాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. శుక్రవారం గుంటూరు 29వ డివిజన్ ఏటి అగ్రహారం, శ్రీరామ్ నగర్ లో ఎమ్మెల్యే గళ్ళా మాధవి మొక్కలు నాటారు. ప్రతి ఇంటిని, ప్రతి ఊరును పచ్చదనంతో ఉండేలా ప్రజలందరూ ఒక్కొక్కరు ఒక మొక్క నాటాలనీ మనం నాటే ప్రతి మొక్క రేపటి తరాలను మనమిచ్చే విలువైన కానుకగా పేర్కొన్నారు. అనంతరం పెదకాకాని శివాలయంలో కూడా ఆమె మొక్కలు నాటారు.

ఆర్‌విఆర్ జెసి కళాశాలలో వనమహోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు



హరితాంధ్ర ప్రదేశ్ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములవ్వాలని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్ల మూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని పేర్కొన్నారు. వనమహోత్సవ్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని కళాశాల ఎన్‌సిసి విభాగాల అధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భయంగా కళాశాల విద్యార్థులు కళాశాల కూడళ్లలో అధ్యాపక బృందంతో కలిసి భారీ సంఖ్యలో మొక్కలను నాటారు. సంపూర్ణ ఆరోగ్య జీవనానికి మంచి పర్యావరణం అవసరమని, అందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని కళాశాల సెక్రట అండ్ కరెస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కష్ణప్రసాద్ పేర్కొన్నారు. తమ కళాశాల ఆధ్వర్యంలో 'మెగా ప్లానిటేషన్' కార్యక్రమం విజయవంతానికి పెద్ద సంఖ్యలో మొక్కలు అందించి కార్యక్రమ విజయానికి సహకరించిన అటవీ శాఖ సిబ్బందికి కళాశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, కళాశాల డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాస రావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి మంగళగిరి : మంగళగిరి గణపతి నగర్లోని ఇందిరానగర్ యూపీహెచ్సీ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన వనమహోత్సవంలో హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ అనూష, సిబ్బంది హెల్త్ సెంటర్ ఆవరణలో మొక్కలు నాటారు.

ప్రజాశక్తి చేబ్రోలు : నారాకోడూరు జడ్‌పి హైస్కూల్లో నిర్వహించిన నమహోత్సవంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నారాకోడూరు లో నిర్వహించారు. భారత్ అండ్ స్కౌట్స్ గైడ్స్ విద్యార్థులు ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

ప్రజాశక్తి -తాడికొండ : మొక్కల్ని నాటి కాలుష్యాన్ని అరికడదామని డిసిఓ కే పద్మజ అన్నారు. వనం మనం కార్యక్రమంలో భాగంగా తాడికొండలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మొక్కలు నాటారు.

ప్రజాశక్తి - మేడికొండూరు

పేరేచర్ల నగరవనంలో నిర్వహించిన వన మహోత్సవంలో గుంటూరు జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ హాజరయ్యారు. మొక్కల పెంపకం పై ప్రత్యేక ప్రతిజ్ఞ పూర్తయిన అనంతరం జెసి భార్గవ్ తేజ మాట్లాడుతూ ప్రకృతిలో పలు రకాల కాలుష్యాన్ని నియంత్రించడం ఒక్క చెట్లు పెంపకం వల్లనే సాధ్యమని తెలిపారు. ఈ సందర్భంగా నగరవణంలో పలువురు అధికారులు, పలు పాఠశాలల విద్యార్థులు మొక్కలను నాటారు.



నూరుశాతం పింఛన్ల పంపిణీకి చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు :గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని 58,798 మంది పెన్షనర్లకు ఆగస్టు 31వ తేదీనే నూరు శాతం ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీకి తగిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని నగర కమిషనర్ పులి శ్రీని వాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ నెలకు సంబంధించిన పెన్షన్లను ఆగస్ట్ 31 వ తేదీనే నూరు శాతం పూర్తి చేయడానికి వార్డ్ సచివాలయ కార్యదర్శుల ద్వారా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని తెలిపారు. నగరం లోని 206 వార్డ్ సచివాలయాల పరిధిలోని వివిధ కేటగిరిలకు సంబందించి 58,798 మంది పెన్షనర్లకు రూ.25,04,20,000లను వారి ఇంటి వద్దనే 1410 మంది సచివాలయ కార్యదర్శులు అందిస్తారన్నారు.పెన్షన్‌ల పంపిణీ సజావుగా జరిగేలా పర్యవేక్షణకు ముగ్గురు డిప్యూటీ కమిషనర్లను ఆధ్వర్యంలో 42 మంది నోడల్ అధికారులను నియమించామన్నారు. పెన్షన్ల పంపిణీ విధులు కేటాయించబడిన కార్యదర్శులు ఆగస్ట్ 31కి ముందే తమకు కేటాయించిన ప్రాంతం, పెన్షనర్ల సంఖ్య(కేటగిరివారీగా), పంపిణీ చేయాల్సిన నగదు తదితర అంశాలను పరిశీలించుకోవాలన్నారు. ఉదయం 6 గంటల నుండే పంపిణీ ప్రారంభించాలన్నారు.



మేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు, కార్మికులు

పారిశుధ్య కార్మికులకు సమ్మెకాలం జీతం ఇవ్వాలి

ప్రజాశక్తి-గుంటూరు

పారిశుధ్య కార్మికులకు సమ్మెకాలం జీతం, సంక్రాంతి కానుక మంజూరుకు అధికారులు చర్యలు తీసుకోవాలని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. శుక్రారం ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు మేయర్‌ను సంపత్ నగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. 2023 డిసెంబర్ 26 నుండి 2024 జనవరి 10వ వరకు పారిశుధ్య కార్మికులు నిర్వహించిన సమ్మె కాలానికి సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జీతాలు, సంక్రాంతి పండుగ కానుక ఇప్పించాలని కార్మికులు కోరారు. స్పందించిన మేయర్ ప్రజారోగ్య అధికారులతో మాట్లాడి పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వ నిర్దేశించిన విధంగా వేతనం, పండుగ కానుక త్వరితగతిన అందెలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి బి.ముత్యాలరావు, నాయకులు పి.శ్రీనివాసరావు, వై.ప్రభుదాస్, కె.మరియదాసు, జి.శ్రీనివాసరావు, బాలప్రసాద్, రెహమాన్, భాష, నాగరాజు, చంటి, వినోద్, సాయి పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న జూపూడి రంగరాజు

ఆటల పోటీల్లో హిందూ ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

అంతర ఫార్మసీ కళాశాలల ఆటల పోటీలలో స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మశీ కళాశాల విద్యార్థులు చక్కని ప్రతిభ చూపించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం తెలిపారు. చేబ్రోలు హనుమయ్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసుటికల్ సైన్సెస్ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలలో తమ కళాశాల విద్యార్థులు క్యారమ్స్ మెన్స్, క్యారమ్స్ మిక్స్, అంత్యాక్షరిలో మొదటి స్థానం, చెస్, దంషరాడ్స్‌లో మూడవ స్థానం పొంది ఓవర్ ఆల్ ఛాంపియన్స్‌గా ఎంపికై ట్రోఫీ, నగదు బహుమతిని గెలుచుకున్నారు అని తెలియచేశారు. ఆయా విద్యార్థులను కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ పి.సీతారామయ్య, డాక్టర్ ఎ.ప్రత్యూష, ఫిజికల్ డైరెక్టర్ లెఫ్టినెంట్ సి.హెచ్. అజిత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులకు టిఎ బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - మాచర్ల

గత నెలలో నిర్వహించిన టీచ్ టూల్ ట్రైనింగ్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులకు వెంటనే టిఎ బకాయిలను చెల్లించాలని ఎంఇఒ సురేష్‌కు ఎపిటిఎఫ్ నాయకులు శుక్రవారం విన్నవించారు. గత నెల 18 నుండి 27వ తేది వరకు నిర్వహించిన టీచ్ టూల్ ట్రైనింగ్‌కు హాజరైన 80 మంది ఉపాధ్యాయులు చివరి రోజున టిఎ బిల్లు ఫారాలు అందించారని, అయినా వాటిని జమ చేయలేదని చెప్పారు.

రేపు విజయవాడలో సిపిఎస్ ఉద్యోగుల బ్లాక్ డే

ప్రజాశక్తి - విజయపురిసౌత్

విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం బ్లాక్‌డే సందర్భంగా నిర్వహించే సిపిఎస్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనానికి సిపిఎం ఉద్యోగులంతా హాజరవ్వాలని ఆంధ్రప్రదేశ్ సిపిఎస్ ఎంప్లాయీస్ రాష్ట్ర మహిళా అధ్యక్షులు డాక్టర్ సాంబేలు శాంతిబాయి కోరారు. కార్యక్రమానికి ప్రముఖులతో పాటుగా మరణించిన సిపిఎస్ ఉద్యోగుల కుటుంబీకులు హాజరవుతారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన యుపిఎస్ విధానం కూడా ఉద్యోగ ఉపాధ్యాయులకు చాలా నష్టమన్నారు. ఓపిఎస్ సాధన కోసం సాగే పోరాటంలో అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు.



ఘనంగా బోనాల వేడుక

ప్రజాశక్తి - మాచర్ల

దుర్గి మండలం ఆత్మకూరులో శుక్రవారం బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. కె.ఆదినారాయణ మాట్లాడుతూ ప్రతి ఏడాది శ్రావణమాసం చివరి శుక్రవారం కులాలకతీతంగా బోనాల పండుగ జరుపుకోవడం ఎప్పటినుండో ఆత్మకూరులో ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో లింగయ్య, ఎం.పుల్లయ్య, బి.వేణు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల, బెల్లంకొండ

సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా పట్టణంలోని 6, 7 వార్డుల్లో పింఛన్లను గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు శనివారం ఉదయం 11 గంటలకు పంపిణీ చేస్తారని టిడిపి పట్టణ అధ్యక్షులు గొంట్ల శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. బెల్లంకొండ మండలం చంద్రాజుపాలెంలో పింఛన్లను పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఉదయం 10 గంటలకు పంపిణీ చేస్తారని టిడిపి మండల అధ్యక్షులు ఎన్.లక్ష్మీనారాయణ తెలిపారు.

పెదకూరపాడుకు మూడు కోట్ల 29 లక్షలు

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలో 7,733 మందికి సామాజిక పింఛన్ల కోసం రూ.3 కోట్ల 29 లక్షల 82 వేల 500 విడుదలైనట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎ.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 5.30 గంటల నుండి పంపిణీ చేపట్టాలని, సాయంత్రానికి 98 శాతం పూర్తి చేయాలని పంచాయతీ సిబ్బందిని కోరారు. మిగతా వారికి సోమవారం పంపిణీ చేస్తామన్నారు. పంపిణీలో నిర్లక్ష్యం వహించే వారిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.





కేంద్రం తెచ్చిన యుపిఎస్ కూడా మోసపూరితమే

యుటిఎఫ్ ఆధ్వర్యంలో పలుచోట్ల నిరసనలు, అధికారులకు వినతులు - ఓపిఎస్ మినహా ఏదీ సమ్మతం కాదని ఉద్ఘాటన



ప్రజాశక్తి-పిడుగురాళ్ల

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన యునిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యుపిఎస్) ఎంత మాత్రమూ ఉపయోగకరమైనది కాదని, మోసపూరితమైందని యుటిఎఫ్ నాయకులున్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం పలుచోట్ల నిరసనలతోపాటు అధికారులకు వినతిపత్రాలిచ్చారు. ఇందులో భాగంగా పిడుగురాళ్లలో డిప్యూటి తహసీల్ధార్ సరోజకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయసారధి మాట్లడుతూ 2004 జనవరి నుండి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2004 సెప్టంబర్ 1 నుండి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు న్యూ పెన్షన్ స్కీమ్ అములు చేస్తున్నాయని అన్నారు. ఉద్యోగులకు పెన్షన్ భిక్షకాదని, హక్కు అని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సైతం ఖాతరు చేయకుండా సిపిఎస్‌నే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని విమర్శించారు. ఓపిఎస్ కోసం 20 ఏళ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయుల పోరాటం చేసిన ఫలితంగా కొన్ని రాష్ట్రల్లో పునరుద్ధరణకు ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో గత వైపిపి ప్రభుత్వం సిపిఎస్ స్థానంలో జిపిఎస్ తీసుకురాగా దాన్ని ఉద్యోగ, ఉపాధ్యాయులు తిరస్కరించారని అన్నారు. జిపిఎస్‌కి మరో రూపంగా ఉన్న యుపిఎస్‌ను కేంద్ర క్యాబినెట్ ఈనెల 22న ఆమోదించిందని, యుఫిఎస్‌ను రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసుకోవచ్చునని సూచన చేసిందని అన్నారు. పాత పెన్షన్‌కు ఎక్కడా పోలికలేని ఉద్యోగ, ఉపాధ్యయలకు లాభంలేని కార్పొరేట్ల షేర్ మార్కెట్‌కు మాత్రమే లాభాన్ని చేకూర్చే యుఫిఎస్‌ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యుఫిఎస్ లాంటి అంకెలగారడి చేసే పెన్షన్ స్కీమ్ వద్దని ఖరాఖండిగా చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఖాసింపీరా, షేక్ జమాల్, చంద్రశేఖర్, సాంబశివరావు, సాయిబాబా, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పెన్షన్‌పై కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన యుపిఎస్ వద్దని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి చిన్నం శ్రీనివాసరావు అన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. చిన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ తాజా స్కీమ్ సైతం ఉద్యోగులకు ఏమాత్రం ఆమోదయోగ్యం కాని, దీన్ని తక్షణమే విరామించుకోవాలని పాత పెన్షన్‌ను ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. సర్దుబాటు పేరుతో టీచర్లను సూదూర ప్రాంతాలకు పంపే ఆలోచనను విరమించి మండల స్థాయికి పరిమితం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బి.వెంకటరావు, కిషోర్ కుమార్, ఠాగూర్, విష్ణుమూర్తి, వెంకటేశ్వరరావు, పద్మావతి, భద్రయ్య, శేషగిరి, శ్రీనివాసరెడ్డి, తోమాసయ్య, తాజుద్దీన్, రాజేశ్వరరావు, వైఎస్ఆర్, సాయిబాబు, అయ్యప్ప, ముస్తఫా, నాగరాజు, బాలరాజు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్ధార్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలిపి తహశీల్ధార్ జియాఉల్‌హక్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెన్షన్ స్కీమ్ అనేది ఉద్యోగులకు ఇచ్చే బిక్ష కాదని, హక్కు అని సుప్రీం కోర్టు తీర్పు చెప్పిన విషయాన్ని పాలకులు గుర్తించాలన్నారు. పాత పెన్షన్ స్కీమ్‌ను కొనసాగించాలని 20 ఏళ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయులు చేసిన పోరాట ఫలితంగా కొన్ని రాష్ట్రాలలో పాత పెన్షన్ స్కీమ్ అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం సిపిఎస్ స్థానంలో జిపిఎస్ అనే కొత్త పథకాన్ని తెచ్చి ఉద్యోగులను మభ్యపెట్టే ప్రయత్నం చేయగా తిప్పికొట్టామని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు శాంతిభాయ్, ఎ.నాసర్‌రెడ్డి, శ్రీనివాసరాజు, కేశవరెడ్డి, ఆదినారాయణ, ఖాదర్‌వలి, శ్రీనునాయక్, ఆయేషా సుల్తానా, స్వామి ప్రసాద్, రామారావు పాల్గొన్నారు.

ఘనంగా వన మహోత్సవం



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలం కాకాని పరిధి జెఎన్‌టియు కాలేజీలో అటవీశాఖాధికారి చిరంజీవి చౌదరి శుక్రవారం వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. వర్షం కారణంగా సిఎం, డిప్యూటీ సిఎం పర్యటన ఇక్కడ రద్దు కావడంతో వారు నిర్వహించాల్సిన కార్యక్రమాన్ని చిరంజీవి చౌదరి పూర్తి చేశారు. ఇతర అధికారులతో కలిసి క్యాంపస్‌లో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. డిఎఫ్‌ఒ రామచంద్రరావు, ఇతర తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పెంచడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా చేసుకుంటేనే పర్యావరణం పచ్చగా ఉంటుందని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో శుక్రవారం నిర్వహించిన వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. మొక్కల పెంపకం కూడా వ్యాపకంలా మారే రోజు రావాలని ఆకాంక్షించారు. చెట్లు నరికేయడంపై ఉన్న శ్రద్ధ పెంచడంపై లేకపోవడం బాధాకరమన్నారు. చెట్ల పెంపకానికి సిఎం చంద్రబాబు ప్రాధాన్యమిచ్చి గతంలో ఉద్యమంలా మొక్కలు నాటితే వైసిపి అధికారంలోకి వచ్చాక వెళ్లిన ప్రతి చోటా చెట్లు నరికేశారని విమర్శించారు. కార్యక్రమంలో జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు జి.వెంకటేశ్వరరావు, వాగ్దేవి కళాశాలల కరస్పాండెంట్ ఆర్.శ్రీనివాసరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎం.మోహన్‌కృష్ణ, పట్టణ అధ్యక్షులు కె.రమేష్‌బాబు, బి.అనిల్, వి.కిషోర్, సిహెచ్.బాలు పాల్గొన్నారు.





ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక ఎన్ఎస్‌పి రోడ్డులోని సాయిబాబా గుడి ఆవరణలో, ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రౌండ్ ఆవరణలో మున్సిపాల్టీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మానవ మనుగడకు చెట్లు పెంచడం ఎంతో అవసరమని చెప్పారు. కార్యక్రమంలో టిపిఒ వెంకట రమణమ్మ, జర్నలిస్టు యార్లగడ్డ చంద్రశేఖర్ ఆజాద్, ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - విజయపురిసౌత్

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసి చైర్మన్ రామ్ చందు నాయక్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. రామ్ చంద్ నాయక్ మాట్లాడుతూ చెట్లను కూల్చడం చాలా సులభమని, పెంచడం ఎంతో కష్టమని చెప్పారు. ప్రతి ఒక్క విద్యార్థి ఒక్కొక్క మొక్కను నాటి చెట్టు అయ్యే వరకూ పరిరక్షించాలని సూచించారు. ఇన్‌ఛార్జి హెచ్ఎం ఉప్పలూరి లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

వర్షాలతో రాజధానిలో ఇసుక సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలానికి చెందిన లింగాయపాలెం, తాళ్లాయపాలెం ఇసుక స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక సరఫరా ప్రక్రియను అధికారులు నిలిపివేశారు. వర్షాల కారణంగా ఇసుక సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఇంచార్జి ఆర్డీవో గంగరాజు తెలిపారు. శుక్రవారం ఆర్డీవో తుళ్లూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద మాట్లాడారు. వర్షాలు కురుస్తుండడం, కృష్ణా నదికి నీటి ప్రవాహం పెరగడం, నదిలో ఇసుక స్టాక్ పాయింట్ వద్దకు వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉండడంతో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇసుక సరఫరాను నిలిపివేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం నుంచి ఇసుక స్లాట్ బుకింగ్ ప్రక్రియను ఆపి వేశామని చెప్పారు. ఇప్పటికే ఇసుక స్లాట్ బుకింగ్ చేసుకున్నవారికి ఎప్పటినుంచి ఇసుక సరఫరా చేసేది ఒకరోజు ముందుగా తెలియ జేయడం జరుగుతుందన్నారు. ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ఉన్న తమ వాహనాలను వెంటనే వెనక్కి తీసుకు వెళ్లాలని వాహనదారులకు సూచించారు.

ఇసుక స్లాట్ బుకింగ్‌లో తేడాలు?

లింగాయపాలెం,తాళ్లాయపాలెం ఇసుక స్టాక్ పాయింట్ ల నుంచి ఇసుకను పొందేందుకు ఏర్పాటు చేసిన ఇసుక స్లాట్ బుకింగ్ లో నిర్దేశించిన దానికన్నా ఎక్కువగా ఇసుక కూపన్లు ఎందుకిచ్చారని..? ఆర్డీవో గంగరాజు తహశీల్దార్ సుజాతను ప్రశ్నించారు. శుక్రవారం సాయంత్రం లోగా తనకు పూర్తి వివరాలు అందజేయాలని ఆదేశించారు.



తహశీల్దార్ సుజాతతో మాట్లాడుతున్న ఆర్డీవో గంగరాజు

పాలకులే మారారు.. విధానాలు అవే..

హుస్సేన్ వర్ధంతి సభలో వక్తలు

ప్రజాశక్తి-తాడేపల్లి

రాష్ట్రంలో పాలకులు మారారు తప్ప... విధానాలు మారలేదని సిపిఎం రూరల్, పట్టణ కార్యదర్శులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బూరుగ వెంకటేశ్వర్లు, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు గాదె సుబ్బారెడ్డి చెప్పారు. సిపిఎం తాడేపల్లి పట్టణ నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు దర్శనపు హుస్సేన్ వర్ధంతి సభ శుక్రవారం తాడేపల్లి ముగ్గురోడ్డులోని సిపిఎం కార్యాలయం వద్ద నిర్వహించారు. ముందుగా హుస్సేన్ చిత్రపటానికి సిపిఎం పట్టణ నాయకులు వేముల దుర్గారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం ఆమోదించిన స్మార్ట్‌మీటర్లను ప్రస్తుత టిడిపి ప్రభుత్వం అమలుకు పూనుకోవడం సరైనది కాదని విమర్శించారు. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న టిడిపి స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టండి అని ప్రజలకు పిలుపునిచ్చిన సంగతిని గుర్తు చేశారు. వీటికి వ్యతిరేకంగా ఆందోళనలు కూడా చేశారని చెప్పారు. ప్రస్తుతం మాట తప్పి ప్రజలపై భారాలు వేయడానికి టిడిపి ప్రభుత్వం పూనుకోవడం ప్రజలు క్షమించరని చెప్పారు. స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మేకా అమరారెడ్డి, బండారు ముత్యాలు, బూదాల డేవిడ్ తదితరులతో కలిసి తాడేపల్లి ప్రాంతంలో పేదల కోసం హుస్సేన్ పని చేశారని తెలిపిఆరు. నేడు వేలాది మంది పేదలకు ఇళ్లు దక్కాయంటే నాటి నుండి నేటి దాకా సిపిఎం చేసిన ఋషి ఫలితమేనని చెప్పారు. రౌడీయిజం, గుండాయిజంకు వ్యతిరేకంగా పేదల తరపున ఎర్రజెండా నిలబడిందని గుర్తు చేశారు. సిపిఎం నాయకత్వం కింద పేదలు ఇళ్లస్థలాలు ద్వారా కోట్లాది రూపాయలు లబ్ధి పొందారని వివరించారు. అమరారెడ్డి లాంటి నాయకుడి మీద కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులు ఉన్నా చివరి దాకా పేదల పక్షాన నిలిచారని చెప్పారు. దర్శనపు హుస్సేన్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అని ఆయనకు జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, నాయకులు దర్శనపు విజయబాబు, ఫిరోజ్, ఎ.శౌరిబర్తులం, ఎన్.దుర్గారావు, వి.సామ్యేలు, బి.గోపిరెడ్డి, ఎం.లీలమ్మ, వై.శ్రీనివాసరావు, కె.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డి వెంకటరెడ్డి

పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులు దూరం

ప్రజాశక్తి - మంగళగిరి

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో సీజనల్ వ్యాధులను అరికట్ట వచ్చని కమిషనర్ అలీమ్‌భాసా తెలిపారు. శుక్రవారం డ్రైడే-ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా మంగళగిరి ఇందిరానగర్ యుపిహెచ్‌సి ఆధ్వర్యంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి అనూషతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు ఫ్రిడ్జ్ లు, పూల కుండీలు, టైర్లు, కొబ్బరి చిప్పలలో నీరు నిల్వ ఉండటం వల్ల దోమల వృద్ధి చెంది మలేరియా, డెంగీ వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. వీటిలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. డాక్టర్ అనూష మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు రాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధి లక్షణాలు కనిపించినపుడు ప్రజలు సొంత వైద్యం, మందుల షాపుల్లో మందులు వాడుతూ నిర్లక్ష్యం చేయరాదని, సమీపంలోని ప్రభుత్వ హెల్త్ సెంటర్లో సంప్రదించాలన్నారు. ప్రభుత్వం అందించే అన్ని రకాల వైద్య సేవలను ఉపయోగించు కోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కె శకుంతలాదేవి, అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు, ఎంపీహెచ్వో వెంకటేశ్వరరావు, నాలుగవ సచివాలయం శానిటేషన్ సెక్రటరీ రాజశేఖర్, ఏఎన్‌ఎం కవిత, ఆశా వర్కర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తెనాలి

ప్రజారోగ్యానికి ప్రథమ శత్రువులు దోమలేనని వాటి నియంత్రణలో అధికారులకు తోడు ప్రజలు కూడా సహకరించాలని మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయం సమావేశం మందిరంలో ఆరోగ్య విభాగం, మలేరియా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా దోమల నియంత్రణపై డ్వాక్రా మహిళలకు, సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. చైర్ పర్సన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇంటి ఆవరణ, పరిసర ప్రాంతాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ బి శేషన్న మాట్లాడుతూ రానున్న పండుగలు దృష్ట్యా మహిళలు ప్రత్యేక శ్రద్ధ వహిస్తే దోమల నియంత్రణ సాధ్యమేనన్నారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె హెలెన్ నిర్మల డెంగ్యూ వ్యాధికి కారకాలైన లార్వాలను ప్రత్యక్షంగా చూపించి, వాటి నిర్మూలనా చర్యలను వివరించారు. సహాయ మలేరియా అధికారి సిహెచ్ ప్రభాకరరెడ్డి ఎ బాలచంద్రమౌళి, జి ప్రసాద్, డి విజయకుమారి, ఆరె సౌజన్య, షేక్ నవీ నవీద్, మైలా అప్పారావు పాల్గొన్నారు.



మంగళగిరి ఇందిరానగర్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్



తెనాలి సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ రాధిక

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - తాడికొండ

అమరావతి, విఐటి విశ్వవిద్యాలయం ఫీడర్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తాడికొండ విద్యుత్ అధికారి ఎస్ వి రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని మోతడక, నిడుముక్కల, లచ్చన్నగుడిపూడి రావెల, పాములపాడు, బేజాత్పురం ,మోతడక గ్రామాలలో అంతరాయం ఉంటుందని ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

బిఎల్ఒలతో తహశీల్దార్ సమీక్షా సమావేశం

ప్రజాశక్తి - పెదనందిపాడు

ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియపై శుక్రవారం పెదనందిపాడు తహశీల్దార్ కార్యాలయంలో బూత్ లెవెల్ ఆఫీసర్ (బిఎల్ ఓ) లతో తహశీల్దార్ పి శంకర్ బాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియ సెప్టెంబర్ 20వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు . సవరణలు, మరణించిన, షిఫ్ట్ అయిన వారి ఓట్లు తదితర అంశాలను పరిష్కరించి అక్టోబర్ 18 నాటికి అప్డేట్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ యెహోషువా మండలంలోని బిఎల్వోలు పాల్గొన్నారు.

ఘనంగా మంగళగిరి విటిజెఎం ఫౌండర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలో నియోజకవర్గ స్థాయిలో మొదటిగా ఏర్పాటు చేసిన డిగ్రీ కళాశాల విటిజెఎం అని, అనంతరం బిఎస్‌సి, బికాం, కంప్యూటర్ సైన్స్ కోర్సులు ప్రారంభించామని కళాశాల మాజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ గోలి రామ్మోహన్ రావు తెలిపారు. శుక్రవారం వీటిజేయం అండ్ విటిఆర్ డిగ్రీ కళాశాలలో 48వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ గొడవర్తి నాగేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోలి రామ్మోహన్ రావు ప్రసంగిస్తూ మొట్టమొదట ఈ కళాశాలలో బిఏ, బీకాం ఎయిడెడ్ కోర్సులు మాత్రమే ప్రారంభించబడినవని తెలిపారు. క్రమశిక్షణ కలిగిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలను అందిస్తున్నటువంటి కళాశాల మంగళగిరిలో విటిజేయం డిగ్రీ కళాశాల అన్నారు. సి.కె జూనియర్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జే. పాండురంగారావు ప్రసంగిస్తూ తమ కళాశాల విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉండటం గర్వంగా ఉందన్నారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గంజి చిరంజీవి మాట్లాడుతూ అతి తక్కువ ఫీజులతో విద్యను అందిస్తున్న ఏకైక విద్యా సంస్థ వీటిజేయం అన్నారు. కళాశాల వ్యవస్థాపక వారసులు, ప్రస్తుత కళాశాల కరస్పాండెంట్ , ప్రెసిడెంట్ వెనిగళ్ళ వెంకట తాతారావు, ఇసునూరి చంద్ర మోహన్ మాట్లాడుతూ తమ వారసులు స్థాపించిన ఈ కళాశాల ఆశయ సాధన కోసం తాము పనిచేయటం చాలా సంతోషంగా ఉందని, మునుముందు కళాశాల అభివృద్ధికై తాము పాటుపడతామని అందరి సహకారంతో కళాశాలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో సహాయ సహకారాలను అందిస్తామని తెలియ జేశారు. కార్యక్రమంలో డాక్టర్ కొల్లి నాగేశ్వర రావు, కళాశాల డీన్ దామర్ల నరసింహం, కమిటి సభ్యులు నరసింహమూర్తి పాల్గొన్నారు.



పొన్నూరు రూరల్ ఎస్సైగా కిరణ్ బాబు

ప్రజాశక్తి - పొన్నూరు



పొన్నూరు రూరల్ ఎస్సైగా జి. కిరణ్ బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన బాపట్ల జిల్లాలో పనిచేశారు. గతంలో ఇక్కడ పనిచేసిన రూరల్ ఎస్సై భార్గవ్ బాపట్ల జిల్లా నగరం పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్ఐ కిరణ్ బాబు మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలు పరిరక్షణకు ప్రజలు సహకరి ంచాలని కోరారు. కోడి పందాలు, పేకాట జూదం నిర్వహణపై నిఘా పెట్టామని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్ట చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రేపు చేనేత విద్యార్థులకు ఉపకారవేతనాల దరఖాస్తులు

ప్రజాశక్తి - మంగళగిరి

చేనేత కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఆదివారం మంగళగిరి మాస్టర్ వీవర్స్ భవనంలో ఉపకార వేతనాలనిమిత్తం ధరఖాస్తులు ఇవ్వబడతాయని మార్కండేయ ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రెటరీ పి రాజశేఖర్ శుక్రవారం తెలిపారు. ఇంటర్ నుండి పీజీ వరకు చదివే విద్యార్థులు అర్హులని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

బీసీల వృత్తుల్ని ఆధునీకరించాలి : కేశన

ప్రజాశక్తి - మంగళగిరి

రజక, నాయి బ్రాహ్మణ, కుమ్మరి, కమ్మరి, నేత, గీత వంటి సామాజిక సేవా వృత్తులు నిర్వహించే బలహీన వర్గాలకు చెందిన బీసీల కులవృత్తుల్ని ఆధునికరించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ప్రాచీన మరియు మధ్యయుగాలలో వెనుకబడిన తరగతులకు చెందిన బీసీ కులాలు ఉత్పత్తి కులాలుగా, ఆనాటి సామాజిక మనుగడకు, కొనసాగింపునకు, సామాజిక, ఆర్థికాభివృద్ధికి ఎంతగానో దోహదపడ్డాయన్నారు. ఆధునిక పెట్టుబడిదారీ యుగంలో దేశంలోని అన్ని ప్రాంతాలలో బీసీల వృత్తులకు పెత్తందారీ కార్పొరేట్ వర్గాలు పోటీకి వచ్చాయన్నారు. పెద్ద మొత్తంలో పెట్టుబడులతో పెరిగిన సాంకేతిక అభివృద్ధిని అందిపుచ్చుకొని ఆధునిక యంత్ర పరికరాలను ఉపయోగించి ఆకర్షణీయంగాను,పెద్ద సంఖ్యలో తయారు చేయడంతో మార్కెట్లో పోటీ తట్టుకోలేక బీసీల కులవృత్తులు ఒక్కటొక్కటిగా మూలన పడుతున్నాయన్నారు. వృత్తులను కొనసాగిస్తున్న కార్మికులకు వారు ఉపయోగిస్తున్న పరికరాల స్థానంలో ఆధునిక సాంకేతికతతో రూపొందించిన ఉత్పత్తి పరికరాలనిచ్చి వారి వృత్తుల్ని కాపాడాలన్నారు. 90 శాతం సబ్సిడీలతో ఉత్పత్తి పరికరాల కొనుగోలుకు ఉత్పత్తుల అమ్మకానికి ప్రభుత్వాలు సహకరించి బీసీ కులవృత్తుల్ని కాపాడి, బీసీ సమాజ సాధికారితకు కృషి చేయాలని శంకర రావు ప్రభుత్వాన్ని కోరారు.



టిడిపి కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న బాలకృష్ణ అభిమానులు

నందమూరి బాలకృష్ణ సినీ స్వర్ణోత్సవాలు

ప్రజాశక్తి - మంగళగిరి : నందమూరి బాలకృష్ణ సినీ రంగ ప్రవేశం చేసి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలను శుక్రవారం మంగళగిరి నియోజకవర్గం టిడిపి కార్యాలయంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళగిరి పట్టణ నందమూరి బాలకృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బైరబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ తనదైన నటనతో టాలీవుడ్‌లో టాప్ హీరో, ఓ లెజెండ్‌గా బాలికృష్ణనిలిచారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, మంగళగిరి పట్టణ అధ్యక్షులు దామర్ల రాజు, మంగళగిరి మండల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు తోట పార్థసారథి, కొమ్మా సుకుమార్, పట్టణ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, నియోజకవర్గ మైనార్టీ, క్రిస్టియన్, బిసి సెల్, అధ్యక్షులు మహ మ్మద్ ఇబ్రహీం, ఎర్రగుంట్ల భాగ్యరావు, వాకా మాధవ రావు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నారాయణకు విట్ ఛాన్సలర్ విశ్వనాథన్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - తుళ్లూరు

మున్సిపల్ శాఖా మంత్రిగా పదవీ భాద్యతలు స్వీకరించిన పొంగూరు నారాయణను విట్ యూనివర్సిటీ ఫౌండర్ ఛాన్సలర్ డాక్టర్ జి. విశ్వనాథన్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శంకర్ విశ్వనాథన్ శుక్రవారం సచివాలయంలోని ఆయన ఛాంబర్‌లో కలసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రాష్ట్రంలో నాణ్యమైన ఉన్నత విద్యను అందించేందుకు విఐటి తరపున పూర్తి సహాయ సహకారం అందిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్‌వి కోటారెడ్డి, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి పాల్గొన్నారు.



మంత్రి నారాయణను అభినందిస్తున్న విట్ విసి జి విశ్వనాథన్



డాక్టర్ యోగేశ్వరరావును సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ నాతాని తదితరులు

వర్సిటీ బోర్డు సభ్యులుగా కృష్ణవేణి డిగ్రీ కళాశాల అధ్యాపకులు నియామకం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా :పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం చిలకలూరిపేట రోడ్డులోని కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో రసాయనశాస్త్ర విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ డి.యోగేశ్వరరావు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో రసాయన శాస్త్రంలో బోర్డు ఆఫ్ స్టడీస్ మెంబర్‌గా నియమించారు. ఈ విషయాన్ని శుక్రవారం కృష్ణవేణి కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. తమ కళాశాల అధ్యాపకులు యోగేశ్వరరావు ప్రతిభను గుర్తించి నాగార్జున యూనివర్సిటీ ఆయా విభాగంలో సభ్యునిగా ఎంపిక చేయడం తమ కళాశాలకు దక్కిన అరుదైన గౌరవంగా భావిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో డాక్టర్ యోగేశ్వరరావును ప్రిన్సిపల్ నాతాని, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ యోగేశ్వరరావు మాట్లాడుతూ రసాయన శాస్త్రంలో సిలబస్‌లో మార్పులకు పరీక్ష విధానం మరియు కొత్త కోర్సులకు సలహాలు, సూచనలు, సంప్రదింపులకు బోర్డు మెంబెర్‌గా నియమితులవడం సంతోషంగా ఉందన్నారు.



ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణికి తెలుగు భాష పురస్కారం

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఘనంగా సన్మానం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆర్ట్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చల్లపల్లి స్వరూపరాణి రాష్ట్ర స్థాయి తెలుగుభాషా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం యూనివర్సిటీలో అధ్యాపకులు, విద్యార్థులు, నాన్ టీచింగ్ సిబ్బంది ఘనంగాసత్కరించారు. 2024 సంవత్సరానికి సంబంధించిన ఆంధ్రప్రదేశ్ తెలుగు భాషా పురస్కారాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చేతులమీదుగా ఆమె అందుకున్నారు. తెలుగు భాషలో ఎన్నో విలువైన రచనలు చేసినందుకుగాను ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఆచార్య స్వరూప రాణిని సత్కరించిన వారిలో యు జి సి కోఆర్డినేటర్ ఆచార్య వై అశోక్ కుమార్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ఆచార్య పి బ్రహ్మాజీరావు, ఆచార్య పిపిఎస్ పాల్ కుమార్, ఫిజిక్స్ విభాగాధిపతి ఆచార్య సి హెచ్ లింగరాజు, అతిథి అధ్యాపకులు డాక్టర్ కే శశిధర్, డాక్టర్ కే మధుబాబు, డాక్టర్ వేణు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందచేస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

మార్కెటింగ్ నైపుణ్యాలపై సెయింట్ ఆన్స్‌లో అవగాహన

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో శుక్రవారం ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్, ఐక్యూఎసి ఆధ్వర్యంలో హిందుస్థాన్ కోకోకోలా, బెవరేజస్, వై4డి ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్తంగా డిగ్రీ తృతీయ సంవత్సరం బిఎస్‌సి, బికాం, ఎంబిఎ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సేల్స్ మార్కెటింగ్ నైపుణ్యాలపై గత మూడు రోజులుగా అవగాహన సదస్సు నిర్వహించారు. వై4డి ఫౌండేషన్ నుండి హాజరైన జి.బెనర్జీ, వినయ్ శ్రీనివాస్ పాల్గొని సేల్స్ మార్కెటింగ్ నైపుణ్యాలపై మెళకువలు తెలియజేశారు. వ్యాపార రంగాలలో ఏ విధంగా రాణించాలో తగు సూచనలు తెలియజేశారు. అనంతరం పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య, వైస్ ప్రిన్సిపాల్ ఐక్యూఎసి కోఆర్డినేటర్ ఆర్.షారూన్ రోజ్, ఉపాధి కల్పన అధికారి డాక్టర్ జె.ప్రతాపరెడ్డి, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి జి.రాధిక, కామర్స్ విభాగాధిపతి జె.ప్రమీలా అధ్యాపకులు పాల్గొన్నారు.

వర్ష సమస్యలపై సహాయానికి జిఎంసిలో కాల్ సెంటర్

ప్రజాశక్తి-గుంటూరు

వాతావరణ శాఖ సూచనల మేరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున గుంటూరు నగరంలో వర్షాల వలన ప్రజలకు ఇబ్బందులు తలెత్తితే తక్షణ స్పందన కోసం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో 24/7 పని చేసేలా ప్రత్యేక కాల్‌సెంటర్ (0863-2345105 లేదా 9849908391కు వాట్సాప్‌కు)ని ఏర్పాటు చేశామని కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.కాల్ సెంటర్‌లో షిఫ్ట్‌ల వారీగా సిబ్బందిని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశామని, వర్షాల వలన నగరంలో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచినా, త్రాగునీటి సరఫరాలో సమస్య ఎదురైనా వెంటనే 0863-2345105 నంబర్‌కి కాల్ గానీ 9849908391కు వాట్స్ అప్ చేయవచ్చన్నారు. సదరు కాల్‌సెంటర్ ద్వారా అందే ఫిర్యాదులపై సంబంధిత విభాగాధికారులు తక్షణం స్పందించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు.వర్షాలకు డ్రైన్‌లు పొంగే అవకాశం ఉన్నందున కల్వర్ట్‌ల వద్ద, అవుట్‌ఫాల్ డ్రైన్లలో వ్యర్థాలు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య అధికారులకు, గాలులకు చెట్ల కొమ్మలు విరిగి రోడ్ల మీద పడితే వెంటనే తొలగించడానికి తగిన ఏర్పాట్లు, సిబ్బందితో ఏడిహెచ్ సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. త్రాగునీటి సరఫరాలో సమస్య రాకుండా, అవసరమైన ప్రాంతాల్లో జనరేటర్లు అందుబాటులో ఉంచేలా చూడాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిస్తే బెయిల్ అవుట్ చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. హెడ్ వాటర్ వర్క్స్ వద్ద విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఆ శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

గుండుసూది మింగిన బాలుడికి శస్త్రచికిత్స

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఆడుకుంటు గుండు సూదిని మింగిన అయిదేళ్ల బాలుడి కడుపులో నుంచి నిమిషాల వ్యవధిలో దానిని బయటకు తీసిన ఉదంతం శుక్రవారం స్థానిక జిజిహెచ్‌లో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సంగడి గుంట ప్రాంతానికి చెందిన షేక్ సోహెల్ అయిదు సంవత్సరాలు. ఇంటి బయట ఆడుకుంటున్న సోహెల్ శుక్రవారం ఉదయం సూదిని మింగాడు. ఆ సూది అన్నవాహికలో ఇరుక్కు పోవడంతో తల్లితండ్రులు భయంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. అత్యవసర విభాగానికి వచ్చిన పేషంట్‌ను పరిశీలించి వెంటనే అక్కడి వైద్యులు గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులకు సమాచారం అందించారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ సహాయ ఆచార్యులు డాక్టర్ షేక్ నాగూర్ బాషా, పీజీ వైద్యులు అనీల్ కుమార్ వివిధ పరీక్షలు చేసి ఎండో స్కోపి ద్వారా నిమిషాల వ్యవధి లో గుండు సూదీని తొలగించి బాలుడిని కాపాడారు. ఏ మాత్రం ఆలస్యం చేసిన పేగుల్లో రంధ్రాలు పడి పేషంట్ ప్రాణానికే ప్రమాదం ఉండేది. ఎంతో జాగ్రత్తగా గుండు సూదిని బయటకు తీసి పేషంట్ ను కాపాడారని ఇంచార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సుధీర్ బాబు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు.

ప్రతీవారం కమిటీ సమీక్ష జరగాలి

బయటి వ్యక్తుల వాహనాలను నియంత్రించండి

పేషెంట్‌తోపాటు ఒకరు లేదా ఇద్దరే ఉండాలి

జిజిహెచ్ సలహా కమిటీ సమావేశంలో కేంద్ర మంత్రి పెమ్మసాని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కోసం ప్రతి వారం హాస్పిటల్ అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించి పురోగతిపై నివేదిక సిద్ధం చేయాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం గుంటూరులోని ఎంపీ కార్యాలయంలో హాస్పిటల్ అడ్వైజరీ కమిటీ (హెచ్ఏసీ)తో ఆయన రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతు ప్రభుత్వాస్పత్రిలోకి బయట వ్యక్తుల వాహనాలను అనుమ తించవద్దని, ఆస్పత్రిలో ట్రాఫిక్ సమస్యను నియంత్రించాలన్నారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ఇన్ఫెక్షన్ రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దీని కోసం పేషెంట్‌తోపాటు ఒకరు, ఎమర్జెన్సీ అయితే ఇద్దరిని మాత్రమే అనుమతిస్తే ఇన్ఫెక్షన్స్‌ను నియంత్రించే అవకాశం ఉంటుందని చెప్పారు. నర్సింగ్ కాలేజీలోని విద్యార్థులను జిజిహెచ్ లో వలంటీర్లుగా తీసుకొని, వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో దళారులపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఏ సమయంలోనైనా రోగులకు మెరుగైన సేవలు అందించాలని, వైద్య సేవల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు.



ఉద్యమ నేత నరసింహారావు ఆదర్శప్రాయులు

నివాళులర్పించిన ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్

ప్రజాశక్తి-గుంటూరు

అధ్యాపక ఉద్యమనేతగా, పౌర హక్కుల సంఘం, నిజమైన వామపక్ష భావజాలంతో పౌర హక్కుల సంఘం నేతగా కడదాకా జీవించిన ఎన్.వి.నరసింహారావు వర్తమాన, భవిష్యత్ తరాలకు ఆదర్శప్రాయమని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. జిల్లా చరిత్ర కాంగ్రెస్ సంఘం ఆధ్వర్యంలో పౌర సమాజం వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్.వి. నరసింహారావు సంస్మరణ సభ స్థానిక బ్రాడీపేట మాజేటి గురవయ్య విద్యా సంస్థల సమావేశ మందిరంలో నిర్వహించారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ తాను నమ్మిన ఆశయాల సాధన కోసం జీవితకాలం కషిచేసిన మహనీయుడని నివాళులు అర్పించారు. చరిత్ర కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ సోమశేఖరరావు చరిత్ర కాంగ్రెస్ ఉద్యమ నిర్మాణంలో దశాబ్దాలుగా నరసింహారావు క్రియాశీలకంగా వ్యవహరించారని కొనియాడారు. కార్యక్రమానికి జిల్లా చరిత్ర కాంగ్రెస్ అధ్యక్షులు ప్రొఫెసర్ ఎన్.శామ్యూల్ అధ్యక్షత వహించగా కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వై.ఎస్.సి బోస్, కార్యదర్శి డాక్టర్ మంచాల బోసుబాబు, సిఎస్ఆర్ ప్రసాద్, వి.లక్ష్మణరెడ్డి, సీనియర్ న్యాయవాది చెరుకూరి సత్యనారాయణ, అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, కుటుంబ సభ్యులు లక్ష్మీ జ్యోతిర్మయి, సుధామయి నరసింహారావు అభిమానులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.



నరసింహారావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న లక్ష్మణరావు, డొక్కా మాణిక్యవరప్రసాద్ తదితరులు

రహదారుల నిర్మాణం వేగం పెంచండి

అధికారులతో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ భేటి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కేంద్ర మంత్రి పెమ్మసానితో సిఆర్‌డిఏ కమిషనర్ కాటంనేని భాస్కర్, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్.హెచ్.ఏ.ఐ) గుంటూరు పి.డి పార్వతీశం శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వివిధ అంశాలపై చర్చించారు. 'కాజా - గొల్లపూడి, చిలకలూరి పేట బైపాస్ నిర్మాణాలు త్వరగా పూర్తి కావాలని మంత్రి పెమ్మసాని కోరారు. పెదకాకాని వద్ద గుంటూరు ప్రవేశ మార్గం టెండర్ల పని పూర్తి చేయాలన్నారు. పెదకాకాని నుంచి గుంటూరు లోకి ప్రవేశించే మార్గం ఏర్పాటు చేయడం పైన నేషనల్ హైవే అధికారులతో పెమ్మసాని మాట్లాడారు. గుంటూరులోకి రాకపోకలు సాగించే విధంగా ఆ మార్గాన్ని సుగమం చేయాలని, త్వరలోనే టెండర్లు పూర్తిచేయాలని ఆదేశాలు ఇచ్చారు. అలాగేగుంటూరు పరిసరాల్లో అభివృద్ధి వేగవంతం చేయాలన్నారు. రాజధాని ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల నిర్మాణాలు జరుగుతూన్నాయి. వందలాది వాహనాలు నిత్యం రాకపోకలు సాగించే ఈ తరుణంలో ప్రస్తుతం కరకట్ట మార్గం ఒకటే అందుబాటులో ఉంది. ఈ క్రమంలో భవిష్యత్తు రద్దీ దృష్ట్యా రాజధాని ప్రాంతాల్లో రాకపోకలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ రహదారుల నిర్మాణంపై పెమ్మసాని పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. రహదారుల నిర్మాణం పై కేంద్ర ప్రభుత్వం ద్వారా చర్యలు తీసుకుంటేనే పనులు వేగవంతం అవుతాయని ఈ సందర్భంగా సిఆర్డిఏ కమిషనర్ తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సపోర్ట్ అవసరమైనా తాను సహకరిస్తానని పెమ్మసాని ఈ సందర్భంగా తెలిపారు.

